# కొసమెరుపు కథలు

వేదగిరి రాంబాబు



## ఆశ

మహేశ్వరరావు డాక్టర్. ఆయన భార్యా డాక్టర్. ఇద్దరూ డాక్టర్లు కాబట్టే వాళ్లిద్దరూవాళ్ల ఒక్కగానొక్క కూతురూ డాక్టరవ్వాలని కోరుకోవడంలో తప్పు లేదుగా?

వాళ్లిద్దరికీ అటు ఆసుపత్రిలో రోగులూ, తప్పితే ఇంట్లో కూతురు రమ్యా తప్ప మరో ధ్యాసే లేదు! రోగుల అనారోగ్యాన్ని పోగొట్టడానికి వాళ్లెంతగా కష్టపడతారో, ఇంటి దగ్గర రమ్య బాగా చదవాలని అంతగానూ తపన పడుతున్నారు.

మహేశ్వరరావుకు డాక్టర్‌గా ఎంత మంచిపేరున్నా, ఆయనకున్న డిసిప్లిన్ వల్ల స్టాఫ్ దగ్గర నుంచి రోగుల వరకూ అందరూ ఆయనని చూస్తే చాలు వణికిపోతుంటారు. డాక్టర్ కరుణ ఆయనకన్నివిధాలా తగ్గ భాగస్వామిని! రోగుల విషయంలో ఆవిడకీ ఎంత కనికరముందో, అంత నిర్దయా వుంది!

చికిత్స కోసం వచ్చిన రోగి తాము చెప్పినట్లే నడుచుకోవాలి. వాళ్లేమాత్రం అలా చేయమంటారా, ఇలా చేయమంటారా అని అడిగితే "డాక్టర్‌వి నువ్వా, నేనా?" అని నిలబెట్టి దులిపేస్తారు. తాము రౌండ్‌కి వచ్చినపుడు సిస్టర్స్ వార్డ్‌ని శుభ్రంగా వుంచకపోయినా, పేషెంట్ దగ్గర అటెండెంట్స్ ఎక్కువగా వున్నా అక్కడే అరిచేస్తారు. అందుకే ఆ డాక్టర్లని చూస్తే ఆ ఆసుపత్రిలో అందరికీ భయం! అయినా వాళ్లే చూడాలని పేషెంట్లు ఎగబడుతుంటారు. కారణంవాళ్ల రోగనిర్ధారణ, చికిత్స అంత బాగుంటాయి కాబట్టి.

రమ్యకి తల్లిదండ్రులంటే ఎంతో అభిమానం. అంతకు మించిన భయం... అందుకే ఆ పిల్లా ఎంతో కష్టపడి చదువుతోంది. ఈ ఎమ్‌సెట్‌లో తనకి మంచి ర్యాంక్ రావాలి. మెడిసిన్‌లో సీట్ రావాలి. అదే రమ్య ధ్యేయం! ఆ ధ్యేయంతో కష్టపడి చదువుతున్నప్పుడు హఠాత్తుగా అమ్మా, నాన్నా రమ్య మనసులో మెదుల్తారు... హఠాత్తుగా చదవాలనే పట్టుదల సడలి, ఆమెలో భయం ప్రారంభమవుతుంది. మనసంతా వికలమైపోతుంది. మళ్లీ హఠాత్తుగా తల్లిదండ్రుల ప్రేమ గుర్తొచ్చితన మీద పెట్టుకున్న ఆశ గుర్తుకొస్తుంది. తిరిగి మనసును చదువు మీద లగ్నం చేయడానికి ప్రయత్నిస్తుంది...

కాలచక్రం తన మానాన తను తిరుగుతోంది.

పరీక్షలు దగ్గరవుతున్నకొద్దీ రమ్యలో మానసికమైన ఒత్తిడి ఎక్కువైంది. తల్లిదండ్రుల ఒత్తిడీ పెరిగింది...

చదువు తప్ప మరో ధ్యాస లేకుండా చదువుతోంది రమ్య. కానీ మనసు కాసేపు చదువు మీద లగ్నమైనా, చటుక్కున భయానికీ లోనవుతోంది... ఆందోళన... విశ్రాంతిలేమి... నలిగిపోతోందామె.

పరీక్షలు వచ్చాయి...

అయిపోయాయి!

అంత ఒత్తిడిలోనూ రమ్య పరీక్షలు బాగానే రాసింది కానీ ఎలా రాశావని తల్లిదండ్రులడిగేసరికి లోపలెక్కడో అనుమానం...!

ఆ అనుమానం రోజురోజుకీ పెరగసాగింది.

పరీక్షాఫలితాలు వచ్చేసమయం దగ్గర పడుతున్నకొద్దీ ఆమెలో భయం పెరగసాగింది.

రేపే...

ఫలితాలు వచ్చేది రేపే!

తన భవిష్యత్తు నిర్ణయించబడేది రేపే!

రమ్యలో కంగారు పెరిగిపోయింది... ఒకవేళ ఏ కారణంగానైనా అనుకున్నట్లు ర్యాంక్ రాకపోతే...?

ఆ ఆలోచనకే ఆకులా వణికిపోయింది రమ్య. ఆమె మనసు ఆలోచనలతో మండిపోతోంది...

బయటికొస్తే అమ్మా, నాన్నా కనిపిస్తారు. భళ్లున తలుపులేసుకుంది రమ్య.

సాయంత్రం పేపర్ పుచ్చుకుని ఆనందంగా కూతురు గది తలుపులు కొట్టారు డాక్టర్ మహేశ్వరరావు దంపతులు. ఎంతసేపటికీ లోపల అలికిడి కాకపోవడంతో ఇద్దరికీ భయం వేసింది.

"అమ్మా రమ్యా! నీకు ఇంటర్‌లో స్టేట్ ర్యాంక్ వచ్చిందమ్మా! తలుపు తియ్!" పిలుస్తూ తలుపుల్ని బాదారు.

చుట్టుపక్కలవాళ్ల సాయంతో తలుపులు పగలగొట్టిన ఆ తల్లిదండ్రులు, విషం పుచ్చుకుని నిరజీవంగా బెడ్ మీద పడున్న కూతుర్ని చూసేసరికి, కెవ్వున అరిచి పడిపోయారు. తనపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల్ని ఎక్కడ నిరుత్సాహపరుస్తానో అనే భయంతో ఆమె అలా చేసింది.

మెడిసిన్‌లో తప్పక సీట్‌సంపాదించాలన్న తమ ఒత్తిడి తట్టుకోలేకే ఆమె అలా చేసిందని వాళ్లు వెంటనే గ్రహించలేకపోయారు. ఇంటర్‌లోనే కాదు, ఆ తర్వాత ఎమ్‌సెట్‌లోనూ తనకి మంచి ర్యాంక్ వచ్చిందని ఆమెకి తెలీదు... తెల్సుకోలేదు... తెల్సుకోనక్కర్లేనంత దూరం వెళ్లిపోయింది కాబట్టి!

ఆశనిరాశల మధ్య ఆ చిన్నారి మనసు ఎంతగా నలిగిపోయిందో ఎవరికీ తెలీదు! ■